వైద్య వృత్తి పవిత్రమైంది

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజే రావు



సన్మాన కార్యక్రమంలో వీసీ బీజేరావు తదితరులు

రాయదుర్గం: సమాజంలో అధ్యాపక వృత్తి తర్వాత అందరూ గౌరవించేది వైద్య వృత్తినేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో 30 మంది ఉత్తమ డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ బీజేరావు మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ లండన్‌లో ఎంఆర్‌సీపీ, ఎఫ్ఆర్‌సీఎస్ రెండేళ్ళ మూడు నెలలలోనే పూర్తి చేసిన అత్యంత ప్రతిభావంతుడైన వైద్య విద్యార్థి అని కొనియాడారు. భారతదేశానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం భారతరత్నతో సత్కరించడంతో పాటు ఆయన జన్మదినమైన జూలై 1న వైద్యుల జాతీయ దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. వైద్య వృత్తి పవిత్రమైందన్నారు. డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణంలో అనేక మార్పులు వస్తున్నాయని, జీవనశైలిలో కూడా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. శారీరక శ్రమ లేకపోవడం, రెడ్ మటన్, కొవ్వు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం ,కల్తీ ఆహారం, నిద్రలేమి ,మద్యపానం, ధూమపానం, మాదకద్రవ్యాల వినియోగంతో వ్యాధులకు గురవుతున్నారని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వైద్య రంగంలో అనేక మార్పులు వచ్చాయని, వాటి సేవలను అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు, ప్రపంచ ఆరోగ్యసంస్థ చూడాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హమీద్‌పటేల్, అసోసియేషన్ సభ్యులు త్రివేణి, వాణిసాంబశివరావు, ధర్మసాగర్, జనార్దన్, పాలంశ్రీను, అమ్మయ్యచౌదరి, విష్ణుప్రసాద్, కుమారి, దివ్య, వరలక్ష్మీ, వీణ, సుజాత, పలువురు వైద్యులు, వైద్యబృందం, సిబ్బంది పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే



ఎంఎనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: కాలనీ, బస్తీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని ఎంఏనగర్ కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. కాలనీలో సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 30 సంవత్సరాలుగా ఇళ్లుకట్టుకున్న వారి జోలికి వెళ్లకుండా ప్రస్తుతం హెచ్‌ఎండీఏ భూమిలో నిర్మించిన ఇళ్లపై ఎలాంటి చర్యలు తీసుకున్న అభ్యంతరం లేదన్నారు. ఎంఏనగర్ కాలనీలో గతంలో నిర్మించిన ఇళ్లకు కూడా నోటీసులు ఇవ్వడం తగదన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలబడతామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ కమిషనర్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ అన్వర్ షరీఫ్, కృష్ణరావు, మల్లేష్, రాజుగౌడ్, శివ, వెంకటేష్, నరేష్,దశరథ్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభించిన జెడ్పీటీసీ

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని అన్ని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల గ్రామంలోని కురుమబస్తీలో రూ.6లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు వేయించేలా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందన

రాయదుర్గం: 'మనూ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ విభాగానికి చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులు డాక్టర్ ఎండి జీషాన్, డాక్టర్ ఏ.క్యూ.సిద్దీకీకి న్యూఢిల్లీలోని జామియా హమ్‌దర్ద్‌లోని సెంటర్ ఫర్ మీడియా అండ్ మాస్ కమ్యూనికేషన్ స్టడీస్‌లో శాశ్వత ఫ్యాకల్టీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ వారిని అభినందించారు.

ఇస్నాపూర్‌లో కుక్కలకు వ్యాక్సినేషన్

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్‌లో 54 కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశామని మండల పశు వైద్యాధికారి శైలేంద్ర జస్వాల్ అన్నారు.సోమవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో మండల పశు వైద్యాధికారులు కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్న గ్రామాల్లో వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ పంచాయతీ సిబ్బంది, పశువైద్య సిబ్బంది పద్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సన్మానం

రాయదుర్గం: ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు కె బాలయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో ప్రతి ఒక్కరికీ తప్పదన్నారు. అనంతరం టీచర్ బాలయ్యను ఘనంగా సత్కరించారు. జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీఈసీ చైర్మన్ కృష్ణాగౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణయాదవ్, సురేష్, నరేందర్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బాలయ్యను సన్మానించిన మాజీ కార్పొరేటర్ సాయిబాబా, హెచ్‌ఎం తాజ్‌బాబు, నాయకులు

30 కిలోల గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆటోలో గంజాయిని తరలిస్తున్న ముఠాను రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 30కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని ఆసిఫ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎండీ. ఇస్మాయిల్ ఆటోడ్రైవర్. గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. జైలులో ఒరిస్సాకు చెందిన గణపతితో పరిచయం ఏర్పడింది. దీంతో అతని ద్వారా గంజాయిని తెప్పించుకుని పటాన్‌చెరు ప్రాంతంలోని కార్మికులకు ఎక్కువ ధరకు అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నాడు. ఆసిఫ్‌న గర్‌కు చెందిన ఖాసీంతో కలసి అదే ప్రాంతానికి చెందిన షాకీర్ బిన్ అవాస్ ఆటోను అద్దెకు మాట్లాడుకుని అందులో గంజాయి పెట్టి వారు స్కూటీపై పటాన్‌చెరుకు బయలుదేరారు. కాగా ఆదివారం లింగంపల్లి చౌరస్తా వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో.. అనుమానంతో షాకీర్ బిన్ అవాస్ ఆటోను తనిఖీ చేయగా 30కిలోల గంజాయి లభించింది. అతని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. దాంతో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయి, ఆటో, స్కూటీ ,3 ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాసిరకంగా పార్కుల పనులు

- వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణంలో నాణ్యత ఏదీ?
- ఎన్నికల హడావిడిలో అధికారులు..
- చక్రం తిప్పిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని పార్కుల అభివృద్ధి పనులు నాసిరకంగా జరిగాయి. పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ల ఇష్టానుసారంగా పనులు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో పార్కుల్లోని వాకింగ్‌ట్రాక్‌ల నిర్మాణంలో నాణ్యత లోపించింది. ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చక్రం తిప్పి పనులు తన వారికే దక్కేలా చూశాడు.



భెల్ ఎంఐజీ కాలనీ రామాలయం ఎదురుగా ఉన్న పార్కులో వాకింగ్ ట్రాక్



నల్లగండ్ల హుడా కాలనీ పార్కులో

- శాలివాహన పార్కు, నక్షత్ర పార్కు, ఆక్సిజన్ పార్కు , భెల్ ఎంఐజీ కాలనీ రామాలయం ఎదురుగా ఉన్న పార్కులలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో జరుగుతున్న పనులు, పార్కులో ఏర్పాటు చేసే పరికరాల్లో నాణ్యత కనిపించడం లేదు.తాము కట్టే పన్నుల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.
- అధికార యంత్రాంగమంతా ఎన్నికలు, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియపై దృష్టి పెట్టడంతో ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చక్రం తిప్పాడు.
- ఆ కాంట్రాక్టు పనులను బినామీల పేరిట తనే స్వయంగా చేపట్టాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- ఈ పార్కుల్లో వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తిగా కచ్చా రోడ్డులాగా ఉంది. ఈ ట్రాక్‌లో వాకర్స్ నడవలేని పరిస్థితి నెలకొంది. మట్టివేసి రోలింగ్ చేయకుండా చదును చేసి వదిలేశాడు. దీనికితోడు ట్రాక్‌కు ఇరువైపులా పెద్ద ఇటుకల స్థానంలో చిన్న ఇటుకలు అవికూడా నాణ్యత లేనివి పెట్టారు. దీనిపై స్థానికులు ఆక్షేపించడంతో మళ్లీ ట్రాక్‌ల పనులు మొదలుపెట్టారు. ఆయా పనులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో హడావుడిగా మార్చే ప్రయత్నం చేశారని తెలుస్తోంది.
- ఆయా పార్కులలో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ల అండర్ సైజ్ కర్బ్‌లను తొలగించే క్రమంలో స్థానికులు నిలదీశారు.
- అడుగు ఎత్తు ఉండే సీసీ కర్బ్‌ల స్థానంలో వాటిలో సగం ఎత్తు వాటితో తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారు.
- సీసీ కర్బ్‌లు ఏర్పాటు చేసే సమయంలో 3 ఇంచుల మేర భూమిలోకి తవ్వి పెట్టాలి. కానీ అలా పనులు జరగలేదు. ఉన్నతాధికారులు ఈ పరిస్థితిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నల్లగండ్ల హుడా నక్షత్ర పార్కులో..



నల్లగండ్ల హుడా కాలనీలో ..

మేనేజర్ ఆదేశాలతోనే చేస్తున్నారు

పార్కులలో వాకింగ్ ట్రాక్‌లలో జరిగిన లోపాలను సరిదిద్దాలని గతంలో పనిచేసిన మేనేజర్ ఆదేశాలతోనే తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. అండర్ సైజ్ కర్బ్‌ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నాం.

– విక్రమ్, మేనేజర్, అర్బన్ బయోడైవర్సిటీ, శేరిలింగంపల్లి సర్కిల్

మాదాపూర్‌లో ఐటీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ఐటీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి మాదాపూర్ అనువైన ప్రదేశమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. మాదాపూర్‌లో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన బీ స్పేస్ సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ పార్టీ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హరికృష్ణ, లింగం తదితరులు పాల్గొన్నారు.

రూ.25.43 కోట్ల ఆస్తి పన్ను వసూలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని మాదాపూర్, గచ్చిబౌలి టీఎస్ ఐఏఎల్‌ఏ నుంచి రూ.25.43 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలైంది. ఈ మేరకు అధికారులు మాదాపూర్ టీఎస్ ఐఏఎల్‌ఏ నుంచి రూ.17,29,93,232, గచ్చిబౌలి నుంచి రూ.8,14,02,881 చొప్పున ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు అయింది. దీంతో ఆయా మొత్తాలను ఏఎంసీలు రామకృష్ణారెడ్డి, శ్రవణ్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బిల్ కలెక్టర్ అనిల్ ,డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

అక్షరాభ్యాసం



రవీంద్రభారతి పాఠశాలలో అక్షరాభ్యాసం

మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాస వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ప్రిన్సిపల్ హైమ సరస్వతీ దేవి పూజ అనంతరం విద్యార్థుల చేత అక్షరాలను దిద్దించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఆర్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

పల్లె ప్రజల అభ్యున్నతికి పాటుపడతాం

ఎస్‌బీఐఆర్‌డీ జీఎం జీవీ శాస్త్రీ



స్టేట్ బ్యాంక్ డే ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌డీ డైరెక్టర్, జీఎం జీవీ శాస్త్రీ

గచ్చిబౌలి: మారుమూల ప్రాంతాలకు శాఖలను విస్తరింప జేసి పల్లె ప్రజల అభ్యున్నతికి పాటుపడతామని ఎస్‌బీఐ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్, జీఎం జీవీ శాస్త్రీ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఎస్‌బీఐఆర్‌డీలో నిర్వహించిన స్టేట్ బ్యాంక్ డే ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాల కంటే ఖాతాదారుల విశ్వాసం, సంతృప్తికే పెద్ద పీట వేసినట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రముఖ సంగీత విద్వాంసులు రామాచారి గానం, చలన చిత్ర గాయకులు సాయిచరణ్, హరిణి పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐఆర్‌డీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.బాలాజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్: మియాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో గత 30 సంవత్సరాలుగా ఉంటున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని ఎంసీపీయూ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు సోమవారం వినతిపత్రం అందించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఎంసీపీఐయూ నాయకులు నిరసన తెలిపి అనంతరం జిల్లా కలెక్టర్ కె.శశాంకకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మియాపూర్ ప్రభుత్వ భూమిలో గత 30 సంవత్సరాలుగా ఉంటున్నామని గత నెల 27 నుంచి హెచ్‌ఎండీఏ అధికారులు, ఎంఏనగర్ ప్రాంతంలో ఉంటున్న వారిని ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. భూ కబ్జాదారులను వదిలేసి పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటుంటే నోటీసులు ఇచ్చి ప్రజలను భయభ్రాంతులను చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎంఏనగర్ కాలనీలో ఇస్తున్న నోటీసులను వెంటనే ఉపసంహరించుకుని 30 సంవత్సరాలుగా ఉంటున్న ఇళ్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు సుకన్య, తుకారాంనాయక్, మహిళా సంఘం నాయకులు పుష్ప, శివాణి, రజియాబేగం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డాక్టర్స్ డే సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందిని స్థానిక బీఆర్ఎస్ నాయకులు షేక్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. వర్తక సంఘం ప్రతినిధులు జ్ఞానేశ్వరి, మొహినుద్దీన్, ప్రభాకర్, సాబేర్, రమేష్, రాజులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందిని సన్మానించిన స్థానిక నాయకులు

సమాచారం

చందానగర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్లు



ఎస్‌హెచ్‌ఓ డి.పాలవెల్లి : 9491039172
ఎస్ఐ నాగేశ్వర్‌రావు : 9010851257
ఎస్ఐ శ్రీధర్ : 8712663181
ఎస్ఐ సరిత రెడ్డి : 7993183570
ఎస్ఐ రఘు : 8712663184
ఎస్ఐ రమేష్ : 9866859530
ఎస్ఐ కిష్టయ్య : 8712663275

మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నంబర్లు

మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ : 9491039172
ఆర్ఐ అనిల్ : 9490617353
ఎస్ఐ మల్లేష్ : 9618581332
ఎస్ఐ నవీన్ : 8712568404
ఎస్ఐ సుభాష్ : 8712663542

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లోని వివిధ ట్రేడ్స్‌లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 18 ఆఖరు అని, కౌన్సిలింగ్ 22వ తేదీ ఉదయం9.30 గంటలకుగచ్చిబౌలిలోని'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో జరుగుతుందన్నారు. దరఖాస్తులను యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో ఉంటాయని, వాటిని డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 040–23008428, 9440692452లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేత

హెచ్‌సీయూ వీసీ బీజేరావు

రాయదుర్గం: విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించామని, హెచ్‌సీయూలో ప్రశాంత వాతావరణం పెంపొందించేందుకు కట్టుబడి ఉన్నామని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు విద్యార్థులు పక్షపాత ఆరోపణలు చేస్తున్నారని, అవి పూర్తిగా నిరాధారమైనవన్నారు. సస్పెన్షన్ ఎత్తివేతతో బాటు పెనాల్టీని విధించాలని నిర్ణయించామని తెలిపారు. తద్వారా విద్యార్థులు తమ విద్యను ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు వీలు కల్పించేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిర్ణయాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కాగా జరిమానాల రూపంలో సేకరించిన నిధులను గురుబక్ష్ సింగ్(హెచ్‌సీయూ మొదటి వైస్‌చాన్స్‌లర్) విద్యార్థుల సహాయనిధిలో జమ చేయబడుతుందని వారు పేర్కొన్నారు.

ప్రజావాణిలో 08 వినతి పత్రాలు



ప్రజావాణిలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

హాఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఏఎంసీ కృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 టౌన్‌ప్లానింగ్‌కు, రెండు రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు వచ్చాయన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 25 ఫిర్యాదులు అందజేశారు. వాటిలో ముఖ్యంగా విద్యుత్ జీరో బిల్లుల కోసం 18 రాగా, యూసీడీ సెక్షన్‌కు సంబంధించి 6, టౌన్‌ప్లానింగ్‌కు ఒకటి వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మెహ్రా, ఏఎంసీ శ్రవణ్‌రెడ్డి, ఏఈ రమేష్, ఎలక్ట్రిసిటీ ఏఈ లిఖిత, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 18 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా, మరో ఇద్దరికి జరిమానాతో పాటు 2 రోజులు జైలు విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాంగ్ రూట్.. 18 బైక్‌లు సీజ్

గచ్చిబౌలి: రాంగ్ రూట్‌లో వచ్చిన 18 బైక్‌లను గచ్చిబౌలి పోలీసులు సీజ్ చేశారు. గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్ యూటర్న్ వద్ద నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు బైకర్లను అడ్డగించారు. కొత్త చట్టం ప్రకారం సోమవారం సాయంత్రం 6 గంటలకు బీఎన్ఎస్ సెక్షన్ 125 కింద కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పీఎస్‌లో కొత్త చట్టం ప్రకారం నమోదు చేసిన మొదటి కేసుగా పోలీసులు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ పోయిందనే దిగులు వద్దు..

పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మొబైల్ ఫోన్ పోయిందని దిగులు పడవద్దని సీఈఐఆర్ ద్వారా ఫోన్ ట్రాక్ చేయవచ్చని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఆరుగురికి వారి ఫోన్లను అందజేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల మొత్తం ఆరుగురు తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. వెంటనే వారు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా, మీ సేవలో ఫిర్యాదు చేయించి, అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించారు. పోగొట్టుకున్న ఆరు ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ రెడ్డి ,క్రైమ్ సీఐ రాజు పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

పటాన్‌చెరు: కళాకారులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని జిల్లా కార్యదర్శి నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శ్రామిక భవన్ లో జరిగిన ప్రజా నాట్య మండలి మండల కార్యకర్తల సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాలుగా కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు ఉద్యోగ అవకాశాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా ఎస్ రాజు, కార్యదర్శిగా దొలప్ప, కమిటీ సభ్యులుగా కృష్ణ,గోపాల్, ప్రసాద్, ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.